సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 21, అక్టోబర్, 2024



వివాహ వేడుకలకు వేళాయె

వివాహ కాలం వచ్చేసింది. దండిగా ముహూర్తాలు ఉన్నాయి.

- 8లో



తమ్ముళ్ల కోసమే తాత్కాలికం

జిల్లాలో పలుచోట్ల ఇసుక రీచ్‌లు ప్రారంభించారు. తమ్ముళ్ల జేబులు నింపేందుకే ఈ ప్రయత్నం.

- 8లో

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని ఆ తర్వాతే డీఎస్సీ నియామకాలు చేపట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్‌జీఓ హోమ్‌లో సమావేశం నిర్వహించారు. మాదిగల కృతజ్ఞత యాత్ర హిందూపురం నుంచి ఇచ్ఛాపురం చేపట్టామని, దీనిలో భాగంగా శ్రీకాకుళం నగరంలో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

కోర్టు కానిస్టేబుల్ పాత్ర కీలకం



ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : శిక్షల శాతం పెరిగేందుకు కోర్టు కానిస్టేబుల్ విధులు, ఆయన పాత్రే కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అన్ని పీఎస్‌ల వారీ కోర్టు కానిస్టేబుల్, కోర్టు (లైజన్) సమన్వయ సిబ్బందితో ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు విధుల్లో అంకితభావంతో పనిచేయాలన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కేసుల విచారణలో సాక్షులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వద్ద ప్రవేశపెట్టి బ్రీఫింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పారినాయుడు పాల్గొన్నారు.

హిందీ మంచ్ నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ భాషగా హిందీని రాష్ట్రంలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలోని 80 ఫీట్ రోడ్‌లో ఉన్న బీకేఎస్ జూనియర్ కళాశాలలో జరిగిన హిందీ మంచ్ సంస్థ జిల్లాశాఖ సర్వసభ్య సమావేశంలో మల్లేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోనే శ్రీధర్ పర్యవేక్షణలో మంచ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవాధ్యక్షులుగా దొంతం పార్వతీశం, ముఖ్య సలహాదారుగా బలివాడ మల్లేశ్వరరావు, సలహా మండలి సభ్యులుగా సురంగి మోహనరావు, బరాటం లక్ష్మణరావు, ఎస్వీ రమణ మాదిగ, అధ్యక్షులుగా సూరంపల్లి బ్రహ్మాజీ (శ్రీకాకుళం), ప్రధాన కార్యదర్శిగా కనుగుల సత్యం (జెడ్పీ హై స్కూల్, అక్కులపేట), సంఘటనా కార్యదర్శిగా రొంపివలస రామారావు (జడ్పీ హైస్కూల్, బెజ్జిపురం, లావేరు), సహాధ్యక్షులుగా సింగూరు రాధ (జడ్పీ హైస్కూల్, కింతలి), సంయుక్త కార్యదర్శులుగా మినతి, వజ్రాల భగత్. ఉపాధ్యక్షులుగా ఈరంకి ఉమారాణి, ఎస్.పద్మనాభరాజు, ఎస్.రాజేశ్వరి, సహాయ కార్యదర్శులుగా కళావతి, ప్రభావతి, జీ.ఆర్.డి గాంధీ, కార్యవర్గ సభ్యులుగా డివిఎస్ పట్నాయక్, దళిక మాధవి, వేణుగోపాల్, పివిఎస్ఎస్ మూర్తి, షేక్ షరీఫ్, జలుమూరు సత్యం, పుక్కళ్ల లక్ష్మణ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉత్తరాంధ్ర జోనల్ కమిటీ సభ్యులుగా పూడి జనార్దనరావు, ఎంపీ మల్లేశ్వరరావు ఎన్నికయ్యారు.

లైంగికయత్నం కేసులో నిందితుడు అరెస్టు

నందిగాం: మండలంలోని పెద్దబాణాపురం పంచాయతీ పెద్దినాయుడుపేటలో శనివారం జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడు తుంగాన భువనేశ్వర్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ తెలిపారు. అతడికి కోర్టు 14రోజుల పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వివాహితపై భువనేశ్వర్ ఆమె భర్త లేని సమయంలో లైంగికదాడికి యత్నించడంతో కేసు నమోదైన విషయం విదితమే.

స్థలం ఇస్తే భవనాలు కడతాం

కోటబొమ్మాళి: రాష్ట్రంలో 82 మహాత్మా జ్యోతీరావ్‌పూలే పాఠశాలలకు సొంత భవనాలు లేవని, ప్రభుత్వం స్థలం కేటాయిస్తే సొంత భవనాలు నిర్మిస్తామని మహాత్మా జ్యోతీరావ్‌పూలే సొసైటీ రాష్ట్ర కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ అన్నారు. ఆయన ఆదివారం కోటబొమ్మాళి మహాత్మా జ్యోతీరావ్‌పూలే పాఠశాలను తనిఖీ చేశారు. జిల్లాలో 13 పాఠశాలలు ఉన్నాయని, ఆదివారం అక్కుపల్లి, పలాస, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి పాఠశాలలను తనిఖీ చేశానని, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు పరిశీలించానని పేర్కొన్నారు.

అమరుల కథ.. స్ఫూర్తిదాయకం కదా

ప్రతి ఊరికీ ఓ చివర ఆంజనేయుడి విగ్రహం ఉంటుంది. మరో చివర పోలీస్‌స్టేషన్ ఉంటుంది. రెండూ ధైర్యాన్నిచ్చేవే. అలా ధైర్యాన్నిచ్చే కొన్ని కథలు కావాలి. పిరికితనం నిండిపోయిన గుండెకు ధైర్యం చెప్పే గొప్ప కథలు కావాలి. చేగువేరాలు, సరిహద్దు సైనికులవి కాకుండా మనతో బతికి మన కోసం చనిపోయిన వారి జీవిత గాథలు కావాలి. ఆ కథలు కావాలంటే పోలీస్‌స్టేషన్ ఎదుట 'అమర వీరులు' అని రాసిన ఫ్లెక్సీలు చూడాలి. ఖాకీ యూనిఫాంలు ధరించి కనిపించే అమరుల కథలు తెలుసుకోవాలి. రద్దీ కూడళ్లలో, ఊరి సంబరాల్లో, దోపిడీలు, దొమ్మీల తర్వాత కనిపించే వారే పోలీసులు కాదని, తూటాకు గుండెను ఎదురొడ్డిన వీరులూ ఉన్నారని తెలుసుకోవాలి. మనసులో ఏమూలనైనా పోలీసులపై ఏ మాత్రం చిన్నచూపు ఉన్నా వీరి త్యాగాలు గుర్తు చేసుకోవాలి.

– శ్రీకాకుళం క్రైమ్



- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- ప్రజా రక్షణలో అమరులైన పోలీసులు
- నేటి నుంచి స్మారకోత్సవాలు ప్రారంభం



వీరమరణం

పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన మజ్జి వెంకటరమణ 1998 న కానిస్టేబుల్‌గా చేరి జిల్లా స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసేవారు. బత్తిలి పీఎస్ పరిధిలో నక్సల్స్ ఉన్నారనే సమాచారంతో అక్కడి ఎస్ఐ, ఆర్ఎస్ఐ వెంకునాయుడు 27 మంది స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి నులకజోడు గ్రామానికి చేరుకున్నారు. 16 మంది నక్సలైట్లు ముందుగా ఐదు చోట్ల పాతిపెట్టిన మందుపాత్రలను పేల్చి పోలీసులపై కాల్పులు జరిపారు. వెంకటరమణ వీరోచితంగా పోరాడి మరణించారు.

ఖాకీ కుటుంబ కథ..



మజ్జి వెంకటరమణ తండ్రి చిన్నోడు

పొందూరు: ఏ కుటుంబమైనా కష్టాల్లో ఉంటే పోలీసులు అండగా ఉంటారు. అదే పోలీసు కుటుంబం ఇబ్బందుల్లో ఉంటే..? మావోయిస్టుల చేతిలో చనిపోయిన మజ్జి వెంకటరమణ కుటుంబం కథ ఇది. ఆయన తల్లిదండ్రులు మజ్జి చిన్నోడు, నరసమ్మ. నరసమ్మ మూడేళ్ల కిందట చనిపోయారు. వెంకటరమణ తమ్ముడు గణపతి విజయవాడలో ఏపీఎస్పీ విభాగంలో పని చేస్తున్నారు. తండ్రి వృద్ధుడు కావడంతో ఆయన విజయవాడకు తీసుకెళ్లలేకపోతున్నారు. తండ్రి పడుతున్న ఇబ్బందులు చూడలేక గణపతి తన భార్యను, మూడేళ్ల కూతురిని కూడా ఇక్కడే ఉంచి ఆయన విజయవాడలో పనిచేసుకుంటున్నారు. ఇటీవల తన తండ్రి కాలికి గాయమైతే రెండు రోజుల తర్వాత గానీ ఆయన రాలేకపోయారు. మరోవైపు భార్య చనిపోయింది, ఓ కొడుకు పోలీసు విధుల్లో చనిపోయాడు, మరో కొడుకు అదే విధుల్లో ఉంటూ దూరంగా ఉండడంతో చిన్నోడును ఒంటరితనం వేధిస్తోంది.

కొండ దగ్గర కాపు కాసి..



విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుణపురం పేట గ్రామానికి చెందిన ఎస్.బంగారునాయుడు జిల్లాలోనే అమరుడయ్యారు. ఈయన 1989 ప్రాంతంలో జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. 1992లో కాశీబుగ్గలో పని చేస్తున్న సమయంలో మందస మండలం బేతాళపురంలో మావోయిస్టులు ఉన్నారని సమాచారం వచ్చింది. స్పెషల్ బ్రాంచితో పాటు బంగారు నాయుడు కూడా వెళ్లారు. ఇద్దరిని పట్టుకుని వస్తుండగా రట్టి కొండ దగ్గర నాగావళి దళం కాపు కాసి కాల్పులు జరపడంతో బంగారునాయుడు నేలకొరిగారు.

నక్సల్స్ తూటాకు బలి



టెక్కలి గ్రామానికి చెందిన ఎం.నరేంద్రదాస్‌కు నక్సలైట్ల సమాచారం సేకరించడంలో మంచి పేరుండేది. ఆయన 1976లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. 1997 మార్చి 17న కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు వెళ్లే సమయంలో దారిలో దైవ దర్శనానికి ఆగి ఉన్న సమయం చూసి నక్సల్స్ పిస్టోల్‌తో కాల్చడంతో వీర మరణం పొందారు.

వీరోచిత పోరాటం



కోటబొమ్మాళి మండలం జర్జంగి గ్రామానికి చెందిన ఎ.పాపారావు 1971న జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో పలాస మండలం నీలిభద్రలోని కంబిరిగాం చౌదరి అనే వ్యక్తిని చంపేందుకు నక్సలైట్లు ప్రణాళిక రచించారు. విషయం తెలుసుకున్న పోలీసులు నలుగురు కానిస్టేబుళ్లతో పికెట్ ఏర్పాటుచేసి హెడ్ కానిస్టేబుల్ పాపారావును ఇన్‌చార్జిగా నియమించారు. 1997 జూలై 17న అర్ధరాత్రి నక్సలైట్లు ఆ ఇంటిపై తుపాకుల గుళ్లతో దాడి చేశారు. చౌదరిని రక్షించే క్రమంలో వీరోచితంగా పోరాడిన పాపారావు నక్సల్స్ తూటాలకు బలయ్యారు.

నక్సల్స్ చేతిలో..



సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన పి.కృష్ణమూర్తి 1988న పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. నక్సలైట్ల కార్యకలాపాల సమాచార సేకరణలో కీలకంగా వ్యవహరించడంతో ఇతన్ని మట్టుబెట్టేందుకు నక్సల్స్ పథక రచన చేశారు. మందస పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో 5.06.2000న నక్సలైట్లు మాటువేసి హరిపురం కూడలికి చేరుకున్న కృష్ణమూర్తి, పీసీ కె.రమేష్‌లపై దాడి చేశారు. ఆ దాడిలో కృష్ణమూర్తి నేలకొరిగారు.

ఇసుక జోలికొస్తే ఏట్లో పాతేస్తామంటున్నారు

- సనపల సురేష్ భార్య మౌనిక
- చంద్రబాబు, లోకేష్ న్యాయం చేయాలి: సనపల సురేష్



ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా మీడియాతో మాట్లాడుతున్న సనపల సురేష్, మౌనిక దంపతులు

శ్రీకాకుళం క్రైమ్ : 'దేవుడి దయ వల్ల మా ఆయన జైలుకెళ్లకుండా బయటపడినా.. మా కుటుంబానికి ప్రాణభయం ఉంది.. ఇసుక జోలికొస్తే నా భర్తను గుత్తావల్లి ఏటిలో పాతేస్తామని.. కూన రవికుమార్ అనుచరులు ఫోన్‌లో బెదిరిస్తున్నారు' అంటూ సనపల సురేష్ భార్య మౌనిక ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా మీడియా ముందు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నుంచి జరుగుతున్న వరుస నాటకీయ పరిణామాల నేపథ్యంలో శనివారం రాత్రి ఆమదాలవలస ఇండిపెండెంట్ అభ్యర్థి సనపల సురేష్‌ను 2022 నాటి కేసులో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళం న్యాయమూర్తి జైలు శిక్ష వేయకుండా విడుదల చేశారు. అనంతరం సనపల సురేష్, అతని భార్య మౌనిక మీడియాతో మాట్లాడారు. కూన రవికుమార్ 2022లో అప్పటి సీఐని ఎదిరిస్తే.. కూన వెనక ఉన్న పాపానికి తన భర్తను ముద్దాయిని చేశారని, తమకు ప్రాణభయం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తన భర్తకు ఏదైనా జరిగితే కూన రవి ఇంటిముందు కూర్చుంటామని చెప్పారు.

నా బాధ్యత ఎవరు చూస్తారు..

సురేష్ మాట్లాడుతూ.. 2022లో జరిగిన ఘటనకు సంబంధించి మార్చి 20న వారెంటు వచ్చిందని, పది నెలలుగా తనకు సమాచారం లేదని, ఏ 1 కూన రవికుమార్, ఏ3 పెంకి రాజశేఖర్‌లు బెయిలుకు దరఖాస్తు చేసుకున్నారని, మరి తన బాధ్యత ఎవరు చూస్తారని ప్రశ్నించారు. తాను ఏ వైఎస్సార్‌సీపీ నాయకుడితోనూ లేనని, తాను ఎక్కడ ఎదుగుతానో అని రవికుమార్ భయపడుతున్నారని అన్నారు. అచ్చెన్నాయుడుకు మద్దతుగా ఒంగోలులో మాట్లాడినప్పటి నుంచి రవికుమార్ కక్ష పెట్టుకున్నారని తెలిపారు. రాజకీయాల్లో తిరిగి సర్వం కోల్పోయానని, తన గృహ ప్రవేశానికి రవికుమార్ భార్యను సోదరిగా భావించి మొదటి కార్డు ఇచ్చానని గుర్తు చేశారు. టీడీపీ అధిష్టానం ఇకనైనా స్పందించాలని కోరారు.

ప్రభుత్వం మద్దతిస్తున్నట్లే..

'లోకేష్ గారు అరెస్టు అయితే కారుమీద వేలాడుతూ వైజాగ్ వెళ్లా. చంద్రబాబు అక్కడ అరెస్టు అయితే నేను ఇక్కడ దీక్ష చేశా. ఈ రోజు నేను అరెస్టయితే దీక్ష చేయక్కర్లేదు. కనీసం ఓ లాయర్‌ను కూడా రానివ్వకుండా ఇంత అరాచకం చేస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే మీద చర్యలు తీసుకోకపోవడం గర్హణీయం. ఇన్ని చేసినా సరే కూటమి ప్రభుత్వం స్పందించకపోతే రవికుమార్‌కు మద్దతిస్తున్నట్లే' అని సురేష్ అన్నారు.



భావనపాడు హార్బర్ ముఖద్వారం వద్ద ఇసుక మేటలు

బోటు కదలదు.. రోజు గడవదు

- భావనపాడు హార్బర్ వద్ద భారీగా ఇసుక మేటలు
- బోట్లు కదలక మత్స్యకారుల ఇక్కట్లు

సంతబొమ్మాళి: మండలంలోని భావనపాడు తీరం వద్ద మత్స్యకారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భావనపాడుతోపాటు చుట్టుపక్కల మత్స్యకార గ్రామాలైన దేవునల్తాడ, గెద్దలపాడు, కంబాల రాయుడుపేట, మంచినీళ్లపేట తదితర గ్రామాల నుంచి మత్స్యకారులు ఇక్కడ నుంచే వేట సాగిస్తారు. ఇక్కడ హార్బర్ వద్ద బోట్లు నిలిపేందుకు అనువైన స్థలం ఉండడంతో బోట్లు లంగర్ వేసి భద్రపరుస్తారు. ఇక్కడి నుంచే సముద్రం లోపలికి వేటకు వెళ్లి చేపలు వేటాడి తీసుకొస్తారు. నాలుగు నెలల నుంచి భావనపాడు మత్స్యకారులకు అనుకోని కష్టం వచ్చి పడింది. మూలపేట పోర్టులో ప్రధాన నిర్మాణమైన బ్రేక్ వాటర్ పనుల వల్ల సముద్రంలో రాళ్లు వేయడంతో సముద్రపు అటుపోట్లకు ఇసుక భావనపాడు హార్బర్ ముఖద్వారం వద్దకు వచ్చి మేట వేసింది. దీంతో హార్బర్ నుంచి నేరుగా సముద్రంలోకి బోట్లు వెళ్లేందుకు ఆటంకం ఏర్పడింది. సుమారు 100కు పైగా బోట్లు ఎక్కడివి అక్కడే ఉండిపోతున్నాయి. తెగించి వెళ్తుంటే బోట్లు తిరగబడుతున్నాయి. దీంతో మత్స్యకారులు వలస వెళ్లిపోతున్నారు. తక్షణమే హార్బర్ వద్ద ఏర్పడిన భారీ ఇసుక మేటలను డ్రెడ్జింగ్ చేసి తొలగించాలని, మళ్లీ మేట వేయకుండా రక్షణ వలయం నిర్మించాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర వ్యవసాయ, మత్స్యకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర పౌర విమానయాశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మత్స్యశాఖ అధికారులను కలిసి వినతులు కూడా అందించారు.

శాశ్వత పరిష్కారం చూపాలి



నాలుగు నెలలుగా వేట లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రత్యామ్నాయ మార్గం లేక వలస వెళ్తున్నాం. ఇసుక తొలగించి భవిష్యత్‌లో ఇసుక మేటలు వేయకుండా రక్షణ వలయం ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలి.

– బత్తిని పకీరు, మత్స్యకారుడు, భావనపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



భావనపాడు తీరం ముఖద్వారం వద్ద ఇసుక మేటలు ఉన్నాయని మత్స్యకారులు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం.

– ధర్మరాజు పాత్రో, ఎఫ్‌డీఓ, టెక్కలి

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉందాం: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రానున్న రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున పరిస్థితి ఎదుర్కొనేందుకు అధికారులంతా సంసిద్ధంగా ఉండాలని, ఎలాంటి విపత్తు వచ్చినా నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఆదివారం జిల్లా ఉన్నతాధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న ట్యాంకులన్నీ పరిశీలించాలని, ఎక్కడైనా ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉంటే వాటిని గుర్తించాలని తెలిపారు.

జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (08942 240557) ఏర్పాటు చేశామని, హాస్టళ్లలో చదువుతున్న వారు హాస్టళ్ల వదిలి బయటకు రాకూడదని తెలిపారు. మండల స్థాయిలో రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేయాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి అక్కడ వీఆర్వోలను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ ద్వారా సమీక్షించాలన్నారు. మత్స్యకారులను సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని, ఎవరైనా సముద్రంలో ఉంటే ఒడ్డుకు చేరుకోవాలని ఆదేశించారు. 21వ తేదీ నుంచి అధికారులంతా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు. 24, 25 తేదీల్లో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లో సాధారణం నుంచి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపిందని చెప్పారు.

నేడు మూలపేట పోర్టు పనులు పునఃప్రారంభం



టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులను సోమవారం పునఃప్రారంభం చేయనున్నారు. 2023లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పోర్టు పనులకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం హయాంలోనే 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశారు. సుమారు రూ.4361.91 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. మొదటి దశలో రూ.2949.70 కోట్లతో నాలుగు బెర్త్‌ల నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. 2023 ఏప్రిల్ 19న శంకుస్థాపన చేశారు. అనంతరం ఏడాది కాలంలోనే పోర్టులో ప్రధానమైన 2,455 మీటర్లు కలిగిన దక్షిణ బ్రేక్ వాటర్ పనులు, 580 మీటర్లు కలిగిన ఉత్తర బ్రేక్ వాటర్ పనులు సుమారు 70 శాతానికి పైగా పనులు పూర్తి చేసి చివరి దశకు తీసుకువచ్చారు. మరో వైపు బెర్త్‌ల నిర్మాణాలు వేగవంతం చేశారు. అంతే కాకుండా పునరావాస గ్రామాలైన విష్ణుచక్రం, మూలపేట గ్రామాలకు చెందిన సుమారు 596 కుటుంబాల కోసం నౌపడ సమీపంలో సుమారు రూ.149 కోట్ల అంచనా వ్యయంతో పునరావాస కాలనీ పనులు ప్రారంభించారు. టెక్కలి సమీపంలో జాతీయ రహదారి నుంచి పోర్టుకు అనుసంధానంగా సుమారు 13.8 కిలోమీటర్ల దూరం కలిగిన అప్రోచ్ రోడ్డు పనులు ప్రాథమిక పనులు పూర్తి చేశారు. మరో వైపు పోర్టుకు 10.6 కిలోమీటర్ల రైల్వే లైన్ కోసం 72.41 ఎకరాల భూసేకరణ చేశారు. ఎకరాకు గరిష్టంగా రూ.26 లక్షలు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. 2023 డిసెంబర్ నాటికి మూలపేట పోర్టు, అప్రోచ్ రోడ్డు ఇతర అభివృద్ధి పనులకు రూ.209.05 కోట్లు విడుదల చేశారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కాలనీ, అప్రోచ్ రోడ్డు తదితర వాటి కోసం రూ.191.41 కోట్లు చెల్లింపులు చేశారు. 2025 నాటికి పోర్టులో కార్యకలాపాలు జరిగే విధంగా బృహత్తరమైన ప్రణాళిక రూపొందించారు.

సెపక్‌తక్ర స్టేట్‌మీట్‌కు సన్నద్ధం

- సిక్కోలు ఆతిథ్యంలో మొదటిసారి రాష్ట్రస్థాయి సెపక్‌తక్ర పోటీలు
- 22, 23 తేదీల్లో శ్రీకాకుళం ఎన్టీఆర్ ఎంహెచ్ స్కూల్ మైదానం వేదికగా పోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి సెపక్‌తక్ర పోటీలు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడామైదానం వేదికగా ఈనెల 22, 23 తేదీల్లో 34వ ఏపీ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల)సీనియర్స్ పురుషులు, మహిళల సెపక్‌తక్ర చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించనున్నారు. సంఘ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, ప్రధాన కార్యదర్శి గాలి అర్జున్‌రావురెడ్డి, ఎస్వీడీ మురళీకృష్ణ, మానస శ్రీనివాస్, న్యూసెంట్రల్ స్కూల్ శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు.

జిల్లాకు చేరుకోనున్న క్రీడాజట్లు..

పోటీలకు పునర్విభజనతో కలిపి మొత్తం 17 జిల్లాల నుంచి క్రీడా జట్లు హాజరుకానున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు. పోటీలకు హాజరయ్యే సెపక్‌తక్ర క్రీడాకారులకు స్థానికంగానే వసతి సదుపాయాలు కల్పిస్తున్నారు. పోటీలు జరుగుతున్న మైదానం సమీపంలో భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు.

ప్రభుత్వ సాయం లేదు..



శ్రీకాకుళం ఆతిథ్యంలో సెపక్‌తక్ర స్టేట్‌మీట్ పోటీలు జరగడం ఇదే మొదటిసారి. పోటీలను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేదు. దీంతో సుమారు రూ.4 లక్షల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్న ఈ పోటీలకు జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ ప్రతినిధులమే డబ్బులు సమకూర్చుకున్నాం. అందరూ సహకరించి పోటీలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, జి.అర్జున్‌రావురెడ్డి, స్టేట్‌మీట్ ప్రధాన నిర్వాహకులు

క్లుప్తంగా

ఆదివాసీలపై దాడులు ఉపేక్షించం

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు



మాట్లాడుతున్న వాబ యోగీశ్వరరావు

జలుమూరు: ఆదివాసీలపై దాడులు చేస్తే సహించేదిలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు అన్నారు. ఆదివారం ఎస్టీ మాకివలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 133 ఏళ్లుగా ఇదే గ్రామంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీల హక్కులకు భంగం కలిగించడం అన్యాయమన్నారు. ఇక్కడ వివాదంలో ఉన్న భూమిపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ సందర్శించి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు తీరు సరిగ్గా లేదని ఆరోపించారు. హరేకృష్ణ సంస్థ ముసుగులో కొంతమంది, అధికార పార్టీలో మరికొందరు ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. రాత్రిపూట కొంత మంది స్వాములు వచ్చి గ్రామం మీద దాడి చేయడం అమానుషమన్నారు. జిల్లా ఎస్పీ పూర్తిస్థాయి విచారణ చేసి దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు అన్యాయం చేస్తే రాష్ట్రస్థాయిలో ఆదివాసీలంతా కలిసి అధికార పార్టీ నాయకుల ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈయనతోపాటు ఆదివాసీ సంఘం ప్రతినిధులు గురడి అప్పన్న, జిల్లా అధ్యక్షులు రాజు, పాపారావు, శాంతారావు, లక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మాకివలసలో 144 సెక్షన్



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు: మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలసలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని, ఇరువర్గాలు సంయమనం పాటించాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. ఆదివారం నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావుతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివాదంలో ఉన్న భూమిలోకి ఎవరూ పోవద్దని హితవుపలికారు. శనివారం రాత్రి జరిగిన వివాదంలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు, జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా అరుణ్‌కుమార్



అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన కె.అరుణకుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులో నిర్వహించారు. ఇందులో శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న అరుణకుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన టైపిస్టులు, స్టెనోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతి పత్రాలు లేకుండానే సీనరేజ్ వసూళ్లు!



ఏఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్‌పోస్టు

పొందూరు: మండలంలోని క్వారీ, క్రషర్ వాహనాల నుంచి సీనరేజ్ వసూళ్లకు సంబంధించి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజులుగా క్వారీల నుంచి రాయి తీసుకువెళుతున్న వాహనాలకు, క్రషరీల నుంచి తరలిస్తున్న వాహనాలకు ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు పలు గ్రామాల వద్ద మైనింగ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. యూనిట్ రాయి చిప్స్‌కు రూ.720, యూనిట్ రాయిబుగ్గికి రూ.500, యూనిట్ ఎర్రమట్టికి రూ.320 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతులు విశ్వసముద్ర పేరుపై ఉన్నట్లు ఏఎంఆర్ ప్రతినిధులు చూపిస్తున్నారు. మీరెందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తుంటే ఎవరు వసూలు చేస్తే మీకేంటని తిరిగి బెదిరింపులు చేస్తున్నారని వాహన యజమానులు చెబుతున్నారు. దీనిపై మైనింగ్ అధికారులను ప్రశ్నించగా జిల్లాలో సీనరేజ్ కాంట్రాక్ట్ ఏఎంఆర్ సంస్థకు ఇచ్చారని, ఇంకా అనుమతి పత్రాలు రాలేదని, త్వరలోనే వస్తాయని చెప్పారు. ఎటువంటి స్పష్టమైన అనుమతి పత్రాలు లేకపోయినా వసూళ్లు ఆగటం లేదని క్రషరీ, క్వారీ యజమానులు ఆరోపిస్తున్నారు.

వివాహ వేడుకలకు వేళాయె!



- అక్టోబర్ నుంచి డిసెంబర్ 23 వరకు శుభ గడియలే
- జిల్లాలో రెండు వేల వివాహాలు జరుగుతాయని అంచనా
- ఊపందుకున్న అనుబంధ వ్యాపారాలు

శ్రీకాకుళం కల్చరల్: కల్యాణ గడియలు వచ్చేశాయి. మూఢం, ఆషాఢం ముగియడంతో ముహూర్తాల సందడి మొదలైంది. అక్టోబరు 12 నుంచి డిసెంబరు 31 మధ్య సుమారు 23 శుభముహూర్తాలు ఉండటంతో జిల్లాలో పెళ్లిళ్లు, అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. తర్వాత సంక్రాంతి పండుగ నెల కావడంతో మళ్లీ వచ్చే ఫిబ్రవరి వరకు ముహూర్తాల కోసం ఆగాల్సిందే. అందుకే ఈ ఏడాది దీపావళి తర్వాత పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఉపనయనాలు, గృహప్రవేశాలు కూడా ఎక్కువగా జరుగుతాయని పండితులు అంచనా వేస్తున్నారు.

షాపింగ్ సందడి..

పట్టణాల్లో పెళ్లిళ్ల షాపింగ్ ఊపందుకుంది. భోజనాలు, క్యాటరింగ్, కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాల్స్, హోటల్స్, డెకరేషన్‌లకు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారు. శుభలేఖల ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటర్స్, ఫొటోగ్రాఫర్లు, టెంట్ హౌస్, వంటమేస్త్రీలు,బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, పూలు అమ్మేవాళ్లు, మంగళవాయిద్యా కళాకారులు, డీజే మ్యూజిక్ నిర్వాహకులు.. ఇలా పెళ్లి వేడుకతో ముడిపడిన ప్రతి ఒక్కరికీ చేతినిండా పని దొరుకుతోంది. ఆర్థికంగా స్తోమత కలగవారు వెడ్డింగ్ ప్లానర్స్‌తో ఒప్పందం చేసుకుంటున్నాయి. సాధారణ, మధ్య తరగతి వారు కూడా తమ స్థాయికి తగ్గట్లు పెళ్లివేడుకలకు ఖర్చు చేస్తున్నారు.

తగ్గేదేలే..

ఎంగేజ్‌మెంట్, ప్రీవెడ్డింగ్, హల్దీ, రిసెప్షన్, పోస్టు వెడ్డింగ్ ఇలా అనేక దశలుగా పెళ్లి వేడుకలు రాజీపడకుండా నిర్వహిస్తున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. కల్యాణ మండపాలు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఇక భోజనాల సంగతి సరేసరి. కొత్తకొత్త వెరైటీలకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా వెనుకాడటం లేదు. పెళ్లి దుస్తుల షాపింగ్‌కు ఒక్కొక్కరు రూ.50వేలకు పైగా వెచ్చిస్తుండటంతో షాపింగ్‌మాల్స్ కళకళలాడుతున్నాయి. పెళ్లి వేడుకలో ముఖ్యమైనది బంగారం. ధరలు పెరుగుతున్నా ఆభరణాలు తమ స్థాయికి తగ్గట్లు కొనుగోలు చేస్తుండటంతో షాపులు కళకళలాడుతున్నాయి.



పెళ్లి మండపం

ముహూర్తాలు మొదలు..



ఈ ఏడాది మూడు నెలలు మూఢం వల్ల అనుకున్నంత మేర వివాహాలు జరగలేదు. ఇప్పుడు శుభ ముహూర్తాలు మళ్లీ మొదలు కావడంతో పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి.

– పి.నర్సింహమూర్తి, పురోహితులు, శ్రీకాకుళం

శుభ ముహూర్తాలివే..

- అక్టోబరు 12 నుంచి 27
- నవంబర్ 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17
- డిసెంబరు 5, 6, 7, 8, 11, 12, 14, 15, 2

చైన్‌స్నాచర్.. కేరాఫ్ కంచరపాలెం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ. వెనుక నిందితుడితో వన్ టౌన్ పోలీసులు

- ఒంటరి మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలు
- జిల్లాలో చోరీ చేసి మెరుపు వేగంతో విశాఖకు పరార్
- రాష్ట్రవ్యాప్తంగా 30 చోరీల్లో ప్రధాన నిందితుడు
- 8.5 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటాడు.. ఆమె పక్క నుంచే బైక్ పోనిచ్చి.. రన్నింగ్‌లోనే మెడలో చైన్‌లు తెంపేస్తాడు.. మరుక్షణమే 100 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ఘటనాస్థలి నుంచి చెక్కేస్తాడు.. ఇదీ విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన భీమరశెట్టి కమల్‌నాథ్ చైన్‌స్నాచింగ్ తీరు. రాష్ట్రవ్యాప్తంగా 30 చోరీల్లో కీలక నిందితుడై.. పదిసార్లు కటకటాల్లో మగ్గిన ఈ చోరుడు.. విడుదలైన వారం రోజుల్లోనే మూడు జిల్లాల్లో నాలుగు చోరీలు చేసి శ్రీకాకుళం పోలీసులకు చిక్కాడు. శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే..

చోరీలివే..

2023 అరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు విషయంలో అరెస్టయ్యి 11 నెలలు విశాఖపట్నం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవించి ఈ ఏడాది అక్టోబర్ 4న విడుదలయ్యాడు. అక్టోబరు 6న తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కాత్రావులపల్లి, సీతానగరం గ్రామాల మధ్య స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో మంగళసూత్రం (16.6గ్రాములు) తెంచేశాడు. అదేరోజు బిక్కవోలులో రోడ్డు వెంబడి నడుస్తున్న మహిళ మెడలో చైన్(రోల్డ్ గోల్డ్) చోరీ చేశాడు. అదే రోజు విజయనగరం జిల్లా డెంకాడ పీఎస్ పరిధి రఘుమండ గ్రామ కూడలి వైఎస్సార్‌కాలనీ వద్ద ద్విచక్రవాహనంపై వెనుక కూర్చుని ఉన్న మహిళ మెడలో రెండున్నర తులాల పుస్తెల తాడు తెంచి పరారయ్యాడు. అది కూడా రోల్డ్ గోల్డ్ కావడం గమనార్హం. అక్టోబరు 11న అరసవల్లి దేవాలయంవైపు వెళ్లి స్కూటీపై ఒంటరిగా వస్తున్న మహిళ మెడలో నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల తాడు తెంచి పరారయ్యాడు.

చోరీ సొత్తు ఏం చేశాడంటే..

దొరికిన చోరీ సొత్తును విశాఖపట్నం మురళీనగర్‌లో ముత్తూట్ ఫైనాన్స్, కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో కమల్‌నాథ్ తండ్రి భీమరశెట్టి శ్రీరామమూర్తి పేరు మీద తాకట్టు పెట్టాడు. వచ్చిన సొమ్మును తండ్రీకొడుకులిద్దరూ పంచుకున్నారు.

వ్యసనాలకు బానిసై..

కమల్‌నాథ్ ఏడో తరగతి వరకే చదివి మధ్యలో ఆపేసి వ్యసనాలకు బానిసయ్యాడు. తండ్రికి మెకానిక్ షాపుండటంతో అక్కడే పనిచేసుకుంటూ తాళాలు లేకుండా వాహనాలు తీయడం నేర్చాడు. 2009 నుంచి బైక్‌లు దొంగిలించడం, మహిళల మెడలో చైన్లు, ఆభరణాలు మాయం చేసేవాడు. ఈ క్రమంలో మొదటిసారి సామర్లకోట రైల్వే స్టేషన్ దగ్గర బైక్ దొంగిలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అరెస్టయి బయటకొచ్చాక మరిన్ని చైన్‌స్నాచింగ్‌లు చేశాడు.

ఎక్కడెక్కడ చేశాడంటే..

కంచరపాలెం, అనకాపల్లి, విజయనగరం టూటౌన్, శ్రీకాకుళం రూరల్, జామి, కొత్తవలస, అరిలోవ, అనపర్తి, ఎచ్చెర్ల, ఎయిర్‌పోర్టు, సబ్బవరం, గోపాలపట్నం పీఎస్‌ల పరిధిలో చోరీలు చేయగా 30 కేసులు నమోదయ్యాయి. ఇందులో పదిసార్లు నేరం రుజువై జైలుకెళ్లాడు.

డీఎస్పీ ప్రశంసలు..

సాంకేతికతను ఉపయోగించి నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న ఒకటో పట్టణ పీఎస్ కానిస్టేబుళ్లు ఎస్.రవికుమార్, ఆర్.సూరిబాబు, ఎం.జగదీష్, హరీష్, వై.రమణమూర్తిలను డీఎస్పీ వివేకానంద ప్రశంసించడమే కాక సీఐ పైడపునాయుడుతో రివార్డులు ఇప్పించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో స్పెషల్ టీమ్ ఇన్‌చార్జిగా ఉన్న సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఎం.హరికృష్ణ, ఏఎస్ఐ బి.రమేష్‌బాబులను అభినందించారు.

మద్యం మత్తుకు.. రెండు నిండు ప్రాణాలు బలి

- ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ
- ఘటనా స్థలంలో ఇద్దరు మృతి
- డ్రైవర్ మందు తాగి నడపడం వల్లే ప్రమాదం!
- జిల్లోడువలసలో విషాదఛాయలు



ఘటనా స్థలంలో భవ్యశ్రీ మృతదేహం



రామారావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు

భవ్యశ్రీ (ఫైల్)

నరసన్నపేట:

జాతీయ రహదారిపై మద్యం మత్తులో లారీ నడిపిన లారీ డ్రైవర్ రెండు నిండు ప్రాణాలను బలి తీసుకున్నాడు. సత్యవరం బైపాస్ రోడ్డుపై ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతులు పోలాకి మండలం జిల్లోడువలసకు చెందిన నక్క రామారావు(48), తియ్యాల భవ్యశ్రీ(17)లుగా గుర్తించారు. గుంటూరు నుంచి కోల్‌కతాకు మిరపకాయల లోడుతో ఈ లారీ వెళ్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ పూర్తిగా మద్యం మత్తులో ఉంటూ తూలుతూ కనిపించాడు. స్థానికులు దాడి చేస్తారని భావించి పరుగులు తీసి పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది.

పావు గంటలో ఇంటికి చేరాల్సిన వేళ..

నక్క రామారావు, తియ్యాన భవ్యశ్రీలు శ్రీకాకుళం సమీపంలోని పరదేశీపాలేంలో బంధువుల వివాహానికి వెళ్లి తిరిగిద్విచక్ర వాహనంపై జిల్లోడువలసకు వస్తున్నారు. మరో పావు గంటలో ఇంటికి చేరుకుంటారనగా సత్యవరం బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో వాహనం వెనక కూర్చున్న భవ్యశ్రీ శరీరభాగాలు నుజ్జయ్యాయి. బండి నడుపుతున్న రామారావు కొన ఊపిరితో ఉండటంతో స్థానికులు ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమయ్యేలోగా మృతి చెందాడు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు రైతు కూలీలు. రామారావుకు భార్య ముత్యాలమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భవ్యశ్రీ స్థానిక జ్ఞాన జ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతోంది. ఇంటికి తొందరగా వెళ్లాలనే ఉద్దేశంతో పొరుగున ఉన్న రామారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురైంది. భవ్యశ్రీ తండ్రి గౌరేసు, తల్లి నరసమ్మ, సోదరుడు లోకేష్ ఉన్నారు. పేద కుటుంబమైనా భవ్యశ్రీని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ఇంతలో ప్రమాదం సంభవించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని మృతుల వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వాహనాలు రోడ్డుపై లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గర్భిణి ఆత్మహత్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: బూర్జ మండలం వావాం గ్రామానికి చెందిన నాలుగు నెలల గర్భిణి రౌత్ అఖిల (20) శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యం పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. ఈమె ఈ నెల 16న పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు స్పందించి 108 అంబులెన్సులో రిమ్స్‌లో చేర్పించారు. శనివారం రాత్రి వరకు అక్కడే వైద్యం అందజేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం వేరే హాస్పటిల్‌కు తీసుకువెళ్తామని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తెచ్చారు. ఆదివారం వేకువజామున ఆమె మృతిచెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు. అఖిలకు భర్త దంతం నిరంజన్, 17 నెలల పాప ఉంది. ఈమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కల్లుగీత కార్మికులకే రిజర్వ్ మద్యం దుకాణాలు



సమావేశంలో పాల్గొన్న శ్రీశయన సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రిజర్వు చేసిన మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికులు సాధించుకోవాలని శ్రీశయన సంఘ నాయకులు అన్నారు. నూతన మద్యం పాలసీ 2024–26ను అనుసరించి మద్యం షాపుల ఎంపిక కోసం గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక రిజర్వేషన్‌లో భాగంగా జిల్లాలో శ్రీశయన/ఇతర కల్లు గీత కమ్యూనిటీల ప్రతినిధులతో ఆదివారం నగరంలోని గురిటి పోలమ్మ ఆలయం ఆవరణలో జిల్లా శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గీత కార్మికుల పది శాతం రిజర్వేషన్ జీవో రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా సర్టిఫికెట్, ఆధార్, సొసైటీ మెంబర్ ఐడీలు, ఇతర పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. సిండికేట్ నాయకులకు తలవంచకుండా 17 దుకాణాలను లాటరీలో గెలుపొందేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. సమావేశంలో జిల్లా శ్రీశయన సంఘం అధ్యక్షుడు మెండ లాల్‌బహదూర్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి గూరు జగదీష్ (అబ్బు), కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ డి.పి.దేవ్, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు లోడ అప్పారావు, గుజ్జల శాంతేశ్వరరావు, బోగాది అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్ చూసి..చోరీలు చేసి..

- తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో నిందితుడు

సోంపేట : ఇంటి తాళాలు ఎలా సులువుగా తెరవచ్చో యూట్యూబ్‌లో చూసి పక్కా ప్లాన్ వేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని సోంపేట పోలీసులు పట్టుకున్నారు. సోంపేట, మందస పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్పడిన ఇతని వద్ద చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మంగరాజు, ఎస్ఐ బి.హైమావతి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోంపేట పట్టణానికి చెందిన కోల కిరణ్ పెయింటింగ్, సెంటరింగ్ పనులు చేస్తుండేవాడు. పేకాటకు బానిసయ్యాడు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో దొంగతనాల మార్గం ఎంచుకున్నాడు. మందస మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఇంటి తాళాలు పగలుగొట్టగా విలువైన వస్తువులు దొరకలేదు. సోంపేటలో తాను నివాసముంటున్న చిన్న కోమటివీధిలోనే తెలిసిన వారి ఇంట్లో చోరీ చేశాడు. ఈ నెల 13న మందస మండలం సొండిపూడిలో తాళాలు వేసిన రెండు ఇళ్లల్లో చొరబడినా విలువైన వస్తువులు దొరకలేదు. ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సుమారు రూ.2 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

నరసన్నపేట: ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) పేరిట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2026 నాటికి 1, 2 తరగతుల పిల్లలందరికీ కనీసం చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ఈ శిక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెలుగు, గణితం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో బోధనా మెలకువలపై నిష్ణాతులైన వారితో అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు జిల్లాలో 1050 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరికి 14 విడతల్లో శిక్షణ ఇస్తారు. మొదటి విడత శిక్షణా కార్యక్రమం ఈ నెల 21న ప్రారంభం కానుంది. ఒక్కో విడతలో 75 మందికి శిక్షణ ఇస్తారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయ సమీపంలోని మహాలక్ష్మీనగర్ కాలనీ వద్ద శ్రీ విశ్వవిజేత జూనియర్ కళాశాలలో ఈ శిక్షణ జరుగుతుంది. ఇందుకు జిల్లా నుంచి కేఆర్‌పీ, ఐదుగురు డీఆర్‌పీలకు ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చారు. శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య కోరారు.

నేటితో టెట్ పరీక్షలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్ : ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఏపీ టెట్ – 2024 పరీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. ఆదివారం ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 100 మందికి 76 మంది, రెండో షిఫ్టులో 101 మందికి 94 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 187 మందికి 163 మంది, రెండో షిఫ్టులో 185 మందికి 160 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

తమ్ముళ్ల కోసమే తాత్కాలికం!

- జిల్లాలో పలుచోట్ల ఇసుక రీచ్‌లు ప్రారంభం
- అధికారిక టెండర్లన్నీ రద్దు చేసిన కూటమి సర్కార్
- ఎడ్ల బండితో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా తీసుకెళ్లేందుకు అనుమతి



గోపాలపెంట ఇసుక రీచ్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)

అరసవల్లి:

తెలుగు తమ్ముళ్ల ఇసుక దందాకు రాష్ట్ర ప్రభుత్వం 'తాత్కాలిక' ఏర్పాట్లు చేసింది. జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు ఇసుక రీచ్‌ల టెండర్లన్నీ రద్దు చేసినప్పటికీ.. మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తయినంత వరకు తాత్కాలికంగా ఇసుకను ఎడ్ల బండితో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా తవ్వి తీసుకెళ్లేలా మైన్స్ శాఖ ఉన్నతాధికారులు సవరణ మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో తమ్ముళ్ల కళ్లలో ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయి. ప్రజావసరాల దృష్ట్యా ఇసుకను సమీప ప్రాంతాల వరకు గత ప్రభుత్వ హయాంలో కూడా ఉచితంగా ఎడ్ల బండ్లపై రవాణాకు అనుమతి ఉండేది. అయితే తమ్ముళ్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న సర్కార్ ఎడ్ల బళ్లతో పాటు ట్రాక్టర్లతో కూడా రవాణా చేసుకోండని అనుమతిచ్చింది. దీంతో తెలుగు తమ్ముళ్ల ఇసుక ఆగడాలకు అడ్డే లేకుండా సర్కార్ దారినిచ్చింది.

రద్దయిన రీచ్‌ల్లో తాత్కాలిక తవ్వకాలు..

జిల్లాలో అంబళ్లవలస, బూరవల్లి (గార), బట్టేరు, హయాతినగరం (శ్రీకాకుళం), నివగాం (కొత్తూరు), గోపాలపెంట (నరసన్నపేట) తదితర ఆరు రీచ్‌లకు ఈ నెల 15న టెండర్ల ప్రక్రియను జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. అయితే అన్ని టెండర్లు అమరావతి బడా వ్యాపారులకే దక్కడంతో తెలుగు తమ్ముళ్ల చాటున అధికార పార్టీ ఎమ్మెల్యేలు..రీచ్‌లన్నీ తమకే కావాలంటూ పట్టు పట్టడంతో..చేసేదేమీ లేక టెండర్లన్నీ రద్దు చేస్తూ సర్కార్ నిర్ణయించింది. దీంతో ఎక్కడికక్కడ ఇసుక టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అంతవరకు ఇసుక రీచ్‌ల వద్ద తాత్కాలికంగా ఇసుక సరఫరాకు సర్కార్ చర్యలు చేపట్టింది. పేరుకే కూటమి ప్రభుత్వమైనప్పటికీ తెలుగు తమ్ముళ్లకు మాత్రమే ఈ ఇసుక దక్కేలా మార్గదర్శకాలున్నట్లుగా తెలుస్తోంది. ఇదే క్రమంలో జిల్లాలో ఇప్పటికే గోపాలపెంట, బూరవల్లి, అంబళ్లవలసల్లో ఇసుక రీచ్‌లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్, మైన్స్ డీడీ సి.మోహనరావుల ఆధ్వర్యంలోనే ప్రారంభించారు. మిగిలినవి కూడా ఒకటెండ్రు రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. దీంతో తమ్ముళ్ల ట్రాక్టర్లతో ఇసుక రవాణాకు రెడీ అయ్యారు. ప్రజల నుంచి ట్రాక్టర్‌కు రూ.3వేలు నుంచి రూ.4 వేల వరకు ఇసుకకు రేటును నిర్ధారించి అమ్మకాలకు సిద్ధపడుతున్నారు. ఇదే క్రమంలో తమ సొంత స్థలాలు, తోటల్లో ఇసుకను భారీగా నిల్వలు ఉంచుకుని అక్రమ రవాణాలకు కూడా మార్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇలా తవ్వుకో..దోచుకో..పంచుకో...విధానాన్ని అమలుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇదేం తీరంటూ సర్కార్ నిర్ణయాలపై జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో ప్రస్తుతం రీచ్‌ల వద్ద తవ్వకాలను ప్రజావసరాల దృష్ట్యా మాత్రమే అనుమతించామని మైన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.